పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- మేడ్చల్‌లో 6,59,079 మంది ఓటర్లు
- మొత్తం 580 పోలింగ్ స్టేషన్లు

మేడ్చల్: నియోజకవర్గంలో నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికల కోసం 6,59,079 మంది ఓటర్లు ఉన్నారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, ఘట్‌కేసర్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం మున్సిపాలిటీలు, బోడుప్పల్, పిర్జాదిగూడ, జవహర్‌నగర్ కార్పొరేషన్లు, మేడ్చల్, శామీర్‌పేట, కీసర, మూడు చింతలపల్లి, ఘట్‌కేసర్ మండలాలు ఉన్నాయి. మొత్తం నియోజకవర్గంలో 6,59,079 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,40,218 మంది పురుషులు, 3,25,703 మంది స్త్రీలు, 58 మంది ఇతరులు ఉన్నారు.

ఓటుహక్కు వినియోగించుకునేందుకు నియోజకవర్గంలో అధికారులు 580 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

580 స్టేషన్లకు ఈవీఎంలు, సామగ్రి పంపిణీ..

మేడ్చల్ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు కీసర డివిజన్ ఆర్డీఓ పర్యవేక్షణలో ఏర్పాట్లను పూర్తి చేశారు. భోగారంలోని హోలిమేరి ఇంజినీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి పోలింగ్‌స్టేషన్ల వారీగా అక్కడి నుంచి ఈవీఎంలను, ఎన్నికల నిర్వహణ సామాగ్రిని పంపిణీ చేశారు. పూర్తి భద్రత ఏర్పాట్ల మధ్య పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలను ఆదివారం సాయంత్రం చేరేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లు ఇబ్బందులు పడకుండా స్థానిక అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దివ్యాంగుల ఓటర్ల కోసం ర్యాంప్‌లు, వీల్ చైర్ల వసతి కల్పించారు.



శామీర్‌పేట్ పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

సమాజ నిర్మాణానికే రాజ్యాంగ రూపకల్పన



ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి కృష్ణతో కలిసి ఆయన ఆదివారం మాట్లాడుతూ.. కుల, మత బేధం లేకుండా సమసమాజ నిర్మాణం కోసం ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి అవసరమైన రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రచించాడన్నారు. శేఖర్, రాజేష్, అరుణ్, రోహిత్, కుమార్, రమేష్, ప్రవీణ్, రఘు, శ్రీనివాస్, గంగారం, కృష్ణంరాజు, విష్ణు, సచిన్, సాయచరణ్ పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కౌన్సిలర్ రమాదేవి

ఘట్‌కేసర్: ఓటు మన జన్మ హక్కు అని ఆ హక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా వినియోగించుకోవాలని మున్సిపల్ రెండోవార్డు కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవిమహిపాల్‌గౌడ్ అన్నారు. ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ఆదివారం ఆమె మాట్లాడుతూ.. మేధావులు మౌనం పాటిస్తే మూర్ఖులు రాజ్యమేలుతారని, ఓటు వేయని వారు జీవించి ఉన్న మరణించినట్లేనన్నారు. ఓటర్లంతా కర్తవ్యంగా భావించి నియోజకవర్గాన్ని బాధ్యతతో అభివృద్ధి చేసే అభ్యర్థికి ఓటేసి ఎంపీగా గెలిపించాలని కోరారు.

ప్రత్యేక పూజలు



కీసర: కీసర మండల ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తన జన్మదినం సందర్భంగా చీర్యాల లక్ష్మీనృసింహస్వామిసేవలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం దేవాలయానికి వచ్చిన ఎంపీపీ దంపతులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించి మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



స్వప్న (ఫైల్)

ఘట్‌కేసర్: మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపంతో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఘనాపూర్‌లోని హ్యాపీ అనాథాశ్రమం విద్యార్థిని కాసర్ల స్వప్న (20) తల్లి చిన్నప్పుడే మరణించడతో ఆమెను తండ్రి సతీశ్ 2009లో ఆశ్రమంలో చేర్పించాడు. ప్రస్తుతం స్వప్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సు చదువుతుంది. గత నెలలో విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు 700 మార్కులు వచ్చాయని తరచూ.. తన స్నేహితులతో చెప్పి బాధపడుతుండేది. ఆదివారం మధ్యాహ్నం తరగతి గదిలోకి వెళ్లి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆశ్రమ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొంతూళ్లకు ఓటర్లు..



మేడ్చల్ డిపో నుంచి ఒంగోలు, ప్రకాశం జిల్లాలకు వెళ్తున్న బస్సు

మేడ్చల్: మేడ్చల్‌లో అధికంగా ఉండే తెలంగాణ, ఆంధ్ర సెటిలర్లంతా ఓటు వేయడానికి సొంతూళ్లకు బయలుదేరి వెళ్లారు. మేడ్చల్ పారిశ్రామిక ప్రాంతం కావడం, నిర్మాణరంగం అత్యధికంగా ఉన్న ప్రాంతం కావడం, శివారులో ఉండటంతో మేడ్చల్‌లో అధికంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉమ్మడి ఒంగోలు జిల్లాకు చెందిన అనేక మంది భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు ఉన్నారు. తెలంగాణ జిల్లాలకు చెందిన మెదక్, నిజామాబాద్, నల్గొండ, వరంగల్ ప్రజలు అధికంగా నివాసం ఉంటున్నారు. వీరంతా సోమవారం జరిగే ఓటింగ్‌లో పాల్గొనేందుకు శనివారం నుంచి ఆదివారం రాత్రి వరకు తమ సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి ఒంగోలు, ప్రకాశంజిల్లాలకు ప్రత్యేక బస్సులు నడపగా.., కొంతమంది ఆంధ్రప్రదేశ్ ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా వాహనాలు, బస్సులు, కార్లు ఏర్పాటు చేసి తమ ఓటర్లను తమ ప్రాంతాలకు తరలించారు. మేడ్చల్‌లో ఉంటూ.. ఆంధ్ర రాజకీయం చేసే నేతలు తమ ప్రాంత ఓటర్ల కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసి అన్నీ తామై చూసుకున్నారు. జాతీయ రహదారిపై తెలంగాణ జిల్లాలకు వెళ్లే ఓటర్ల రాకపోకలు అధికంగా కనిపించాయి.

మేడ్చల్ నియోజకవర్గంలో ప్రాంతాల వారీగా...

ప్రాంతం	పోలింగ్ స్టేషన్లు	ఓటర్లు
మేడ్చల్(మున్సిపాలిటీ)	41	41,138
గుండ్లపోచంపల్లి	17	19,666
తూంకుంట	10	24,002
నాగారం	43	53,101
దమ్మాయిగూడ	37	46,726
ఘట్‌కేసర్	33	29,670
పోచారం	8	21,717
జవహర్‌నగర్ (కార్పొరేషన్)	75	65,126
బోడుప్పల్	57	76,711
పిర్జాదిగూడ	50	56,457
మేడ్చల్(మండలం)	34	32,332
శామీర్‌పేట్	15	33,215
కీసర	31	21,980
ఘట్‌కేసర్	37	41,952
మూడు చింతలపల్లి	14	20,265
మొత్తం	580	6,59,079

మేడ్చల్ : మేడ్చల్ నియోజకవర్గంలో నేడు నిర్వహించే ఎన్నికల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో 6,59,079 మంది ఓటర్లున్నారు. వీరిలో 3,40,218 మంది పురుషులు, 3,25,703 మంది స్త్రీలు, 58 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. అధికారులు మొత్తం 580 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

14న భగీరథ మహర్షి జయంతి వేడుకలు

నగర సంఘం అధ్యక్షుడు ఉప్పరిశేఖర్

గచ్చిబౌలి: భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని రాష్ట్ర నగర సంఘం అధ్యక్షుడు ఉప్పరిశేఖర్ తెలిపారు. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కఠోర దీక్షతో ఒంటి కాలిపై తపస్సు చేసి పరమ శివుడిని ఒప్పించి పవిత్ర గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహనుభావుడు భగీరథుడు అని అలాంటి మహనీయుని జయంతి వేడుకలను నిర్వహించడం సమాజానికి అవసరమన్నారు. సగరజాతి కులగురువైన ఆయన వేడుకలను తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామ, మండల, జిల్లా కేంద్రాలలో కూడా సగరులు ఎక్కడికక్కడ ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు భగీరథుని జయంతి వేడుకలు జరుపుతున్నప్పటికీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి ఎన్నికల కోడ్ రావడంతో ఈ ఏడాది నిర్వహించడం లేదని స్పష్టం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ రావు,బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఇతర ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మున్సిపాలిటీల్లో మోడల్ పోలింగ్‌స్టేషన్లు



కీసర: నాగారం,దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్‌స్టేషన్ల వద్ద తగిన ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. పోలింగ్‌స్టేషన్ల వద్ద తాగునీరు, వేసవిని దృష్టిలో పెట్టుకుని టెంట్లు, తదితర ఏర్పాట్లను పూర్తి చేశామని అధికారులు తెలిపారు.

- నాగారం మున్సిపాలిటీలో మొత్తం 53,001 మంది ఓటర్లు, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 46,726 ఓటర్లు, కీసర మండలంలో 21,980 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.
- సెంట్ మేరీ స్కూల్‌లో 222 పోలింగ్‌స్టేషన్‌లో యువ ఓటర్లు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ మోడల్ యువతరం పోలింగ్‌స్టేషన్‌ను దమ్మాయిగూడ మున్సిపాలిటీలో సిద్దార్థ పాఠశాల్లో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాట్లు చేశారు.



స్ట్రాంగ్ రూమ్‌లో పోస్టల్ బ్యాలెట్ బాక్సులు



పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీజ్ చేసిన అధికారి

సాక్షి, మేడ్చల్ జిల్లా : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా భోగారంలోని హోలీ మేరీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లో ఆదివారం పోలైన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్ సీల్డ్ బాక్సులను పోలీసుల బందోబస్తుతో వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీల్‌చేసి భద్రపరచినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గౌతమ్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు..

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా భోగారంలోని హోలీ మేరీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఆదివారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను తరలించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, కంటోన్మెంట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల నిర్వహణలో భాగంగా 8,066 బ్యాలెట్ ప్యాట్లు, 4,032 కంట్రోల్ ప్యాట్లు, 4,515 వీవీ ప్యాట్లను ఎన్నికల సిబ్బంది తరలించారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతమ్ అధ్వర్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలతో పటిష్టమైన పోలీసు భద్రతతో పోలింగ్ కేంద్రాలకు తరలించారు.





అడ్మిషన్లు షురూ

శంషాబాద్:పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజేంద్రనగర్)లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9441956233, 7032713785.

కైత్లాపూర్‌లో 622.08 లీటర్ల మద్యం పట్టివేత

పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

కూకట్‌పల్లి: ఎన్నికల తనిఖీల్లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న 622.08 లీటర్ల మద్యాన్ని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వత్‌నగర్ ప్రాంతంలో ఓ వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు పర్వతనగర్ నుంచి కూకట్‌పల్లి వైపు వస్తున్నారు. కైత్లాపూర్ బ్రిడ్జి కింద సబ్ ఇన్‌స్పెక్టర్ మల్యానాయక్ తన బృందంతో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. 622.08 లీటర్ల మద్యంపై బ్లూ కవర్ కప్పి తరలిస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు కవర్ తీసి చూడగా మద్యం సీసాలు కనిపించారు. దీని విలువ సుమారు రూ.6,84,288 ఉంటుందని తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో మద్యం స్వాధీనం చేసుకున్నామని అన్నారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మరో ఇద్దరు అనిల్, సైదులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ దేవరాజ్, కానిస్టేబుల్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో వడదెబ్బ తగిలి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రామునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో గత కొద్ది రోజులుగా అతడు బిక్షాటన చేసుకుంటూ.. ఓ ఇంటి పక్కన కూర్చునేవాడని, స్థానికంగా ఉండే పావని అనే మహిళ అతడికి భోజనం పెడుతుండేది. కాగా ఈనెల 10న మధ్యాహ్నం 2 గంటల సమయంలో అతడు ఓ ఇంటి దగ్గర అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా.. ఆమె ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించింది. అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి పేరు మహేష్, తనది ఆంధ్రప్రదేశ్ అని, తనకు ఎవరూ లేరని చెప్పేవాడని పావని తెలిపింది. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఆచూకీ తెలిసిన వారు ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలిపై సిరా చుక్క.. కంప్యూటర్ కోర్సుల్లో 80శాతం రాయితీ పక్కా

కాచిగూడ: ఓటు వేయండి.. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో 80 శాతం రాయితీతో శిక్షణ పొందండి అంటూ పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆదివారం ప్రకటించింది. యువతలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు, ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ ద్వారా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఈ రాయితీని ప్రకటించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. 80 శాతానికి పైగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటు వేసిన సిరా గుర్తు గల వేలిని చూపిస్తూ సెల్ఫీ దిగి వాట్సాప్ నెంబర్ సెల్: 9505800047 కు పంపిన యువతీ యువకులకు, విద్యార్థులకు కోర్సు ఫీజులో 80 శాతం రాయితీ కూపన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్ కోర్సుల వివరాలు, రిజిస్ట్రేషన్ వివరాలు పంపడం జరుగుతుందన్నారు.

సినిమాలు యువతను పెడదారి పట్టించొద్దు

'గాంజా శంకర్' సినిమా పేరు మార్చండి: రామకృష్ణ

కాచిగూడ: యువతను పెడదోవ పట్టించే విధంగా సాయిధరమ్ తేజ్ నటించిన 'గాంజా శంకర్' సినిమా పేరును వెంటనే మార్చాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. గాంజా శంకర్ సినిమా పేరుపై సినిమా నిర్మాత, దర్శకులు పునరాలోచించాలని ఆయన సూచించారు. ఇలాంటి పదాల వల్ల సమాజంపై ముఖ్యంగా విద్యార్థులు, యువతపై పెనుప్రభావం చూపుతుందని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో పేరున్న పెద్ద హీరోలు సినిమాల్లో ధూమపానం, మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారని, ఈ హీరోలు నేటి యువతకు ఏమి సందేశం ఇవ్వదల్చుకున్నారని ఆయన ప్రశ్నించారు. కమర్షియల్ సినిమాలు తీయడంలో తప్పులేదని, కానీ మన సంస్కృతి, సంప్రదాయాలలను మర్చిపోయి యువతను పెడదోవ పట్టించే విధంగా ఉన్న సినిమాలు చేస్తే అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. దీనిపై సెన్సార్ బోర్డు స్పందించి సినిమా దర్శక, నిర్మాతలకు నోటీసులు అందజేయాలని ఆయన కోరారు.

నృత్యం.. మంత్రముగ్ధం



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి వచ్చిన భరతనాట్య కళాకారిణి రక్షా దేవనాదన్ నట్టికురంజి రాగం వర్ణం, జయదేవ అష్టపది అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. కళాకారులు దీక్ష, అద్వితీ, శ్లోక, నయోనికా, లాస్య, లక్ష, సమన్విత, హెత్విక, తమదైన శైలిలో నృత్యాలు ప్రదర్శించారు.

–మాదాపూర్